సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



నలుగురికి కోవిడ్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ అనుబంధ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో నలుగురు విద్యార్థినులు బుధవారం కోవిడ్ బారిన పడ్డారు. వీరిని హోం ఐసోలేషన్‌కు తరలించారు.




అవధుల్లేని ఆనందం

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం రెండు పుష్కరాలుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ-98 అభ్యర్థుల కల సాకారమైంది. బుధవారం వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 6,329 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,829, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కులు వదిలారు.

రంజాన్ వేళలు

అమలాపురం

ఇఫ్తార్	-	సెహరీ
గురువారం (సా)		శుక్రవారం (ఉ)
6:27	-	4:25

సహకార సర్దుపోటు

- డీసీసీబీ నిర్ణయంతో పీఏసీఎస్‌లపై భారం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సొసైటీల సారథులు
- నష్టం కలగకుండా చూస్తామని డీసీసీబీ చైర్మన్ హామీ



సాక్షిప్రతినిధి,కాకినాడ: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ తీసుకున్న ఓ నిర్ణయం తమపై భారం మోపిందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) సారథులు లబోదిబోమంటున్నారు. పది, పదకొండేళ్ల క్రితం రైతులకు సర్దుబాటు చేసిన ఆరు, నాలుగు శాతం రాయితీల కోసం ఇప్పుడు భారం మోపడం సరికాదని వాపోతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డీసీసీబీ పాలకపక్షం అవినీతి, అవకతవకలతో నష్టాల్లోకి పోయిన సంఘాలకు ఈ తాజా నిర్ణయం గుదిబండగా మారిందంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 299 సహకార సంఘాల్లో 80 శాతం సంఘాలు డీసీసీబీ తాజా నిర్ణయంతో ఆందోళనలో పడ్డాయి.

ఏమైందంటే..

సభ్యులైన రైతులకు సహకార సంఘాలు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇస్తుంటాయి. సాగు భూమిని బట్టి రుణ పరపతి రూ.50వేల నుంచి రూ.లక్ష పైన ఉంటుంది. ఇలా ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలు మార్చి 31లోపు, స్వల్ప కాలిక రుణాలు ఏడాది లోపు తిరిగి చెల్లిస్తే రైతులకు సొసైటీలు వడ్డీలో ఆరు, నాలుగు శాతం రాయితీ ఇస్తుంటాయి. ఈ రాయితీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆప్కాబ్‌కు, ఆప్కాబ్ నుంచి డీసీసీబీ, అక్కడి నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తిరిగి వస్తుంటుంది.

దశాబ్దం నాటి మాట

2010–2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులకు వడ్డీ రాయితీ సొమ్ము విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ సొమ్ము వస్తుందని, ఈ లోపు రైతుల నుంచి వడ్డీ రాయితీ సొమ్ము మినహాయించుకుని మిగిలింది మాత్రమే జమ చేసుకోవాలని సొసైటీలకు అప్పట్లో డీసీసీబీ సూచించింది. ఇందుకు అనుగుణంగా వడ్డీ రాయితీ సొమ్మును రైతుల వడ్డీలకు సర్దుబాటు చేసి తగ్గించి జమ చేయించుకున్నాయి. ఒక మోస్తరు సంఘంలో రూ.నాలుగైదు లక్షలు, రైతులు, రుణపరపతి ఎక్కువగా ఉన్న పెద్ద సంఘాల్లో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు సర్దుబాటు అయ్యాయని అంచనా.



చైర్మన్ వీర్రాజును కలిసి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

సొసైటీల ఆవేదన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సర్దుబాటు అయిన వడ్డీ రాయితీ సొమ్ము రూ.19.20 కోట్లు. నాటి ప్రభుత్వ నిర్వాకంతో ఇప్పటికీ ఆప్కాబ్ ద్వారా డీసీసీబీకి ఆ సొమ్ము తిరిగి జమ కాలేదు. ఇప్పుడు ఆ మొత్తాన్ని సర్దుబాటు చేసుకునేందుకు డీసీసీబీ 299 సహకార సంఘాల నుంచి మార్చి 30, 31 తేదీలలో పూర్తిగా జమ చేసుకుంది. సొసైటీలకు కొత్త పంట రుణాలు ఇచ్చినట్టుగా రికార్డు ప్రకారం చూపించింది. ఆ మొత్తాన్ని పదేళ్ల క్రితం వడ్డీ రాయితీ బకాయిల కింద సర్దుబాటు చేసేసింది. ఈ సర్దుబాటుతో డీసీసీబీ లాభాల బాట పట్టింది. సర్దుబాటు సందర్భంలో చలానాలను ఇవ్వకపోవడాన్ని సొసైటీ సీఈఓలు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి ఆధారం లేకుండా సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసమని సొసైటీల త్రిసభ్య కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహజంగా సొసైటీలు రైతులకు నేరుగా పంట రుణాలు ఇవ్వాలే తప్ప ఇవ్వకుండా సర్దుబాటు చేయడంపై సహకార ఆడిటర్లు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది. తాజా నిర్ణయం వల్ల ఆర్థిక అసమతుల్యతలో ఉన్న సహకార సంఘాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది సరికాదు

భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది లేకుండా సర్దుబాటు చేస్తామని సర్క్యులర్‌లో డీసీసీబీ పేర్కొన్నప్పటికీ దీనిని సొసైటీలు విశ్వసించడం లేదు. ఆ సొమ్ము ప్రభుత్వం నుంచి రాగానే సర్దుబాటు చేస్తామని డీసీసీబీ చెబుతోన్న మాటలను కొట్టిపారేస్తున్నాయి. భారం తమపై పెట్టడం సమంజసం కాదంటూ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. డీసీసీబీ సీఈఓ ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను సంఘాల సీఈఓలు బాయ్‌కాట్ చేశారు. నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తమకు న్యాయం చేయాలంటూ మూడు జిల్లాల సహకార శాఖలోని వివిధ స్థాయిల్లోని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

నష్టం రాకుండా చూస్తాం

సంఘాలకు ఇబ్బంది కలగనీయకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సహకార సంఘాల సీఈఓలు, ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కేవీవీ సత్యనారాయణ, కడగల ఆదినారాయణ, ఎర్రంశెట్టి రామచంద్రరావు తదితర ప్రతినిధులు ఇటీవల ఈయన్ను కలిశారు. దీనిపై వీర్రాజు స్పందిస్తూ డీసీసీబీ సీఈఓ, సహకార అధికారులు, సొసైటీ యూనియన్ నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సంఘాలకు నష్టం కలగకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సర్దుబాటుకు చట్టబద్ధత లేదు



సర్దుబాటు చేయడానికి చట్టబద్ధత లేదు. ఈ విషయాన్ని చట్టం అనుమతించదు. సొసైటీ మహాజన సభలో పదేళ్లక్రితం తీర్మానం చేసి అప్పటి వరకు లావాదేవీలన్నింటిపై ఆడిట్ రిపోర్టు, ఐటీ రిటర్న్‌లు దాఖలు చేశాక ఇప్పుడు సర్దుబాటు చేస్తామంటే ఎలా. ఇది న్యాయ సమ్మతం కాదు. సాంకేతికంగా సొసైటీలకు ఇబ్బందులు ఎదురవుతాయి.

తోట వెంకట్రామయ్య,ట్రెజరర్,రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్

గత అనుభవంతో మెరుగైన సేవలు

జిల్లా కొత్త ఎస్పీగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

అమలాపురం టౌన్: పదేళ్ల కిందట అమలాపురం డీఎస్పీగా పనిచేసిన అనుభవంతో ఇప్పుడు కోనసీమ జిల్లాకు మెరుగైన సేవలు అందిస్తానని ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుసరాపు శ్రీధర్ స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రథమ కర్తవ్యమన్నారు. జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చిన ఆయన బుధవారం మధ్యాహ్నం స్థానిక ఎస్పీ కార్యాయలంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన అయినవిల్లి సిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆయన ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా ఏఎస్పీ కె.లతా మాధురితోపాటు అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు వై.మాధవరెడ్డి, బాలచంద్రారెడ్డి, వెంకటరమణలతోపాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు కొత్త ఎస్పీ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అధికారులతో ఎస్పీ శ్రీధర్ జిల్లా పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం తనను కలసిన విలేకర్లతో ఎస్పీ మాట్లాడారు.

లా అండ్ ఆర్డర్‌పై అధ్యయనం

గతంలో తాను ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన పాత పరిస్థితులు, ఇప్పుడు కొత్తగా జిల్లా ఏర్పడ్డాక వచ్చిన కొత్త పరిణామాలను బేరీజు వేసుకుని లా అండ్ ఆర్డర్‌పై అధ్యయనం చేస్తానని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ముఖ్యంగా యువత పెడదారి పట్టేలా ప్రేరేపిస్తున్న నేరాల అదుపు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. పాత ఎస్పీ తనదైన శైలితో ఓ మార్కు పోలీసు సేవలను చూపించారని, అదే శైలిని కొనసాగిస్తానన్నారు. పోలీసుల టీమ్ వర్క్‌తో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు.

న్యూస్‌రీల్

సాగును లాభసాటి చేయాలి



ఏరువాక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా తదితరులు

ముమ్మిడివరం: రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడంతో పాటు మేలైన వంగడాలను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా శాస్త్రవేత్తలకు సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏరువాక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్జీ రంగా వ్యవసాయ ఏరువాక కేంద్రం గతంలో విశాఖ జిల్లాలో సేవలందించిందని చెప్పారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు జిల్లాల పర్గీకరణలో భాగంగా విస్తరణ కేంద్రం కోనసీమ జిల్లాకు తరలి వచ్చిందన్నారు. ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధనా స్థానాలను, వ్యవసాయ శాఖను సమన్వయ పరుస్తుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన సంస్థ వివిధ రకాల వరి వంగడాల ప్రదర్శన ఏర్పాటు చేసింది. శాస్త్రవేత్తలు భవిత శర్మ, నాగేశ్వరరావు, రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, రాష్ట్ర అగ్రి కల్చర్ మిషన్ సభ్యులు జిన్నూరి రామారావు, జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకే మట్టి పరీక్షలు



మట్టి నమునాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తదితరులు

అల్లవరం: మట్టి పరీక్షలతో భూమిలోని పోషకాలను గుర్తించి తద్వారా భూమికి కావలసిన అదనపు పోషకాలను ఇస్తూ పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చుని జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. అల్లవరం మండలంలోని అల్లవరం రైతు భరోసా కేంద్రంలో జిల్లాలలోని వ్యవసాయాధికారులు, గ్రామస్థాయి వ్యవసాయాధికారులకు భూసార, మట్టి నమునాలపై ఒక రోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త గౌరి, జిల్లా శిక్షణ కార్యాలయ ఉప సంచాలకులు జ్యోతిర్మయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మట్లాడుతూ మట్టి నమూనా పరీక్షలు ప్రతి గ్రామంలో నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ 16లోగా మట్టి నమునాల సేకరణపై గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఏరువాక శాస్త్రవేత్త గౌరి మాట్లాడుతూ భూ పరిరక్షణ, మట్టి రకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని బోడసకుర్రు, గూడాల, దేవగుప్తం గ్రామాల్లోని వరి క్షేత్రాల్లో 50 మట్టి నమూనాలను సేకరించారు. వీటికి సామర్లకోటలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, ఏడీలు ఎం.షంషీ, దుర్గాలక్ష్మి, అల్లవరం ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

అమలాపురం రూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రలో భాగంగా అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు స్థానిక డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ తెలిపారు. మే మూడో తేదీన బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాల్లోని దేవాలయాల దర్శనానికి దర్శించుకుంటూ వెళ్లి ఐదో తేదీ అరుణాచల గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఏడవ తేదీ తిరిగి అమలాపురం వస్తుందన్నారు. పుష్ బ్యాక్ 2 + 2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్దలకు రూ.2,950, పిల్లలకు రూ.2,200, ఇంద్ర ఏసీ బస్సుకు పెద్దలకు రూ. 4,000, పిల్లలకు రూ.3,000గా టికెట్ ధర నిర్ణయించామని చెప్పారు.

బీసీ కులగణన నిర్ణయం అభినందనీయం

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: బీసీ కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని బీసీల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని శెట్టిబలిజ గ్రంథాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర అధ్యక్షతన బుధవారం పార్టీ బీసీ నేతల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా సూర్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులగణనకు రాష్ట్ర స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయడం బీసీలంతా స్వాగతించే అంశమని అన్నారు. బీసీ కులాల గణనతో ఆయా సామాజిక వర్గాలకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగనుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, నాయకులు కుడుపూడి త్రినాథ్, జి.శ్రీను, చప్పిడి శోభన్‌బాబు, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తం.. సాధికారతకు ఊతం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- జిల్లాలో 12,818 మంది లబ్ధిదారులకు రూ.19.23 కోట్లు జమ



నమూనా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు, దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ సత్య శైలజ, అధికారులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అగ్రవర్ణ మహిళల కోసం అమలు చేస్తున్న వైఎస్సార్ ఈబీసీ నేస్తం వారి ఆర్థిక సాధికారతకు తోడ్పాటు అవుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులు బటన్ నొక్కి విడుదల చేసిన సందర్భంగా స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. ఈ నిధులతో చిన్న తరహా కుటీర పరిశ్రమలు నెలకొల్పుకుని మహిళలు వారి కాళ్లపై వారు నిలబడాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం తరహాలోనే ఈబీసీ నేస్తం అగ్ర వర్ణాల మహిళల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే భరోసాను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలకు ఈ పథకం ద్వారా ఏటా రూ.15 వేలు సాయం అందే ఏర్పాట్లు చేశారని కలెక్టర్ శుక్లా వివరించారు. జిల్లాలోని రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఈ ఆర్థిక సాయం అందిందని చెప్పారు. జిల్లాలో ఈ విడత 12,818 మంది లబ్ధిదారులకు రూ.19.23 కోట్ల మేర లబ్ధి ఆయా మహిళల అకౌంట్లలో జమ అయిందన్నారు. చివరగా కలెక్టర్ శుక్లా, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు లబ్ధిదారులైన మహిళలకు రూ.19.23 కోట్ల నమూనా చెక్‌ను అందజేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ ప్రతినిధి జి.ఫణీంద్రకుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇలా...

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	ఖాతాల్లో పడ్డ సొమ్ము
అమలాపురం	1,114	రూ.1.67 కోట్లు
పిగన్నవరం	1,071	రూ.1.61 కోట్లు
కొత్తపేట	3,612	రూ. 5.42 కోట్లు
మండపేట	3,353	రూ.5.3 కోట్లు
ముమ్మిడివరం	1,472	రూ.2.21 కోట్లు
రామచంద్రపురం	1,335	రూ.2 కోట్లు
రాజోలు	861	రూ.1.29 కోట్లు

చక్కగా.. మరింత పక్కాగా

- సహకార చట్టంలో తాజాగా సవరణలు
- ఓటుహక్కు పరంగా పెను మార్పులు
- గత ప్రభుత్వాల్లో జరిగిన తప్పిదాలకు కళ్లెం

అమలాపురం టౌన్: రాష్ట్ర సహకార శాఖ ఇటీవల సహకార చట్టంలో చేసిన పలు సవరణలు ఈ వ్యవస్థలో గత ప్రభుత్వాల్లో జరిగిన తప్పిదాలకు క్లెం వేయనున్నాయి. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), సహకార ఆడిట్, సభ్యులకు ఓటు హక్కు విషయంలో ఈ సవరణలు చేసింది. మొత్తం 12 అంశాలకు సంబంధించి ఈ సవరణలు జరిగాయి. జిల్లాలోని ఉన్న 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఈ సవరణల అమలుకు జిల్లా సహకార అధికారి కార్యాలయం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ సవరణలపై ఆయా సంఘాల సీఈవోలకు శిక్షణ ఇచ్చింది. ఆడిట్ విధానంలో వచ్చిన మార్పులపై కూడా అవగాహన కల్పించింది. గత టీడీపీ హయాంలో సహకార సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే రైతులకు ఎన్నికల నోటిఫికేషన్ కొద్దిరోజులు ముందు హడావుడిగా ఓటుహక్కు కల్పించే పరిస్థితి ఉండేది. దీంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు అడ్డదారులు తొక్కేవారు. తాజా సవరణలతో అలాంటి అవకాశాలకు, ప్రయత్నాలకు పూర్తిగా చెక్ పెట్టినట్లయింది. జిల్లాలోని 166 సంఘాల్లో ప్రస్తుతం 2,14,178 మంది రైతులు సభ్యత్వాలతో ఓటుహక్కు కలిగి ఉన్నారు.




అమలాపురంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయం

ఇక నుంచి ఓటు హక్కు ఇలా..

- సహకార సంఘంలో సభ్యత్వం పొందితేనే ఓటు హక్కు వస్తుంది. ఇప్పుడు ఓటు హక్కు కావాలంటే ఎన్నికల నోటిఫికేషన్‌కు ఏడాది ముందు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి సభ్యత్వం పొందాలి.
- సంఘంలో కేవలం రూ.300 చెల్లించి సాధారణ సభ్యత్వంతో ఉండి, ఎలాంటి బిజినెస్ చేయకుంటే ఇక నుంచి ఆ సభ్యునికి ఎన్నికల్లో ఓటు హక్కు లభించదు.
- రూ.300తో సభ్యత్వం ఉన్న సభ్యుడు ఎన్నికలకు ముందు ఏడాది సంఘంలో రుణం తీసుకోవడం లేదా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయడం, ఏదైనా వ్యవసాయం యంత్రం రాయితీపై పొందడం, ఎరువులు కొనుగోలు చేయడం వంటివి చేసి ఉండాలి.
- భూస్వామి లేదా కౌలు రైతుగా ఉన్నవారు మాత్రమే సభ్యులుగా ఉండి సంఘంలో వ్యాపార లావాదేవీలు ఎంతో కొంత చేయాలి.
- ఆర్బీకేలు అనేవి వ్యవసాయ శాఖకు సంబంధించినవి. ధాన్యం కొనుగోలు బాధ్యతలు సహకార సంఘాలకు అప్పగిస్తున్న క్రమంలో ఆర్బీకేలను 1964 సహకార చట్టం ప్రకారం ఇప్పుడు సంఘాల్లో కలిపారు.
- గతంలో సహకార సంఘాల్లో ఆడిట్ ఏటా సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి అయ్యేది. ఇక నుంచి జూన్ మాసాంతానికే పూర్తి చేస్తారు.

మరింత బలోపేతం



సహకార చట్టంలో తాజాగా జరిగిన 12 అంశాల సవరణ వల్ల ఈ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా సహకార సంఘాల్లో ఓటు హక్కు పొందేందుకు జరిగిన సవరణలు సంఘ కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీల్లో సభ్యులైన రైతులను బాధ్యులను, భాగస్వాములను చేసేలా ఉన్నాయి. ఆడిట్ పరంగా తీసుకుని వచ్చిన మార్పులు సంఘాల ఆర్థిక క్రమశిక్షణకు దోహదపడతాయి.

– ఎ.రాధాకృష్ణారావు, జిల్లా సహకార అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నేడు పీఎస్, బీఎస్ పరీక్షలు

- రెండు సబ్జెక్టులకు ఒకే ప్రశ్నపత్రం
- సమాధానాలు రాసేందుకు వేర్వేరు ఓఎంఆర్ షీట్లు

రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం ఫిజికల్ సైన్స్(పీఎస్), బయలాజికల్ సైన్స్(బీఎస్) పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ పరీక్ష నిర్వహణపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకే రోజు నిర్వహించే రెండు పరీక్షలకు రెండు వేర్వేరు సమాధాన పత్రాల్లో విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నపత్రం ఒకటే ఇచ్చినప్పటికి 1–16 వరకు ఫిజికల్ సైన్స్, 17–33 వరకు బయలాజికల్ సైన్స్ ప్రశ్నలుంటాయి. జవాబులు రాసేందుకు విడివిడిగా ఓఎంఆర్ షీట్లు ఇస్తారు. ఒక్కో షీట్‌లో 12 పేజీలు ఉంటాయి. వీటిని విద్యార్థికి ఒకేసారి ఇస్తారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్ షీట్‌పై పేపర్ కోడ్–19, పేపరు పేరు సైన్స్ పీ–1, బయలాజికల్ సైన్స్ ఓఎంఆర్ షీట్‌పై పేపర్ కోడ్–20, పేపరు పేరు సైన్స్ పీ–2 అని ముద్రించి ఉంటుంది. విద్యార్థులు రెండు సబ్జెక్టులకు సంబంధించి సమాధానాలు రాసే సమయంలో ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సూచిస్తున్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్, డీవోలు ఇన్విజిలేటర్లకు ఈ విషయమై అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

18 నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

రాయవరం: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం వీటిని నిర్వహించనున్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లు జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. అక్రిడిటెడ్ ఇనిస్టిట్యూట్స్(ఎ.ఐ) స్టడీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందించనున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,683 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లా నుంచి 3,045, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 2,553, తూర్పుగోదావరి జిల్లా నుంచి 2,085 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

తాచుపాముకు వైద్య సేవలు



వైద్యసేవల అనంతరం పామును చూపుతున్న వర్మ

ఉప్పలగుప్తం: రబీ వరి కోతల నేపథ్యంలో వరి కోత యంత్రంలో పడి గాయపడిన తాచుపాముకు వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయపాలెంలో తాచుపాము ఐదు రోజుల క్రితం గాయపడి కదలలేని పరిస్థితిలో ఉంది. ఈ విషయం గమనించిన గ్రామస్తులు అదే గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు బుధవారం సమాచారం అందించారు. పాము గాయపడిన ప్రాంతానికి చేరుకున్న వర్మ తోక పూర్తిగా తెగిపోవడంతో వైద్య సిబ్బంది సహాయం కావాలని కోరారు. కేసనకుర్రు పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దొమ్మేటి రమేష్ పాముకు తగిలిన దెబ్బలను శుభ్రం చేసి గుడ్డతో కట్టు కట్టారు. పాముకు సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని వర్మ తెలిపారు. అనంతరం పామును సురక్షిత ప్రాంతానికి తరలించి వదిలిపెట్టారు. వర్మను, రమేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

అవధుల్లేని ఆనందం

- క్వాలిఫైడ్ అభ్యర్థుల కల సాకారం
- రెండు పుష్కరాల నిరీక్షణకు తెర
- 285 మంది ఉపాధ్యాయులుగా నియామకం

రాయవరం: ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం రెండు పుష్కరాలుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ–98 అభ్యర్థుల కల సాకారమైంది. బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలు ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా 24 ఏళ్ల అనంతరం వారి కలను సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో క్వాలిఫైడ్ అభ్యర్థులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సందర్భంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల ఇస్తామని ప్రకటించారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జీవో నంబరు 27ను విడుదల చేసింది. కాంట్రాక్టు ప్రాతిపదికన వీరి నియామకాలు చేపట్టి, ఎంటీఎస్ కింద వేతనాలు చెల్లించనున్నారు.



అభ్యర్థికి నియామక పత్రం ఇస్తున్న కాకినాడ డీఈవో కె.అన్నపూర్ణ

285 మందికి ఇంటర్వ్యూలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు 556 మంది దరఖాస్తు చేసుకున్నారు. 70 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గైర్హాజరవ్వగా, మిగిలిన 486 మంది ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు అంగీకరించారు. అయితే జీవో 27 ప్రకారం 285 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఆ మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎస్‌జీటీ పోస్టుల్లో వీరిని నియమించారు.

టీచర్‌గా మారనున్న సర్పంచ్

కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరు సర్పంచ్‌గా పనిచేస్తున్న వాసంశెట్టి వెంకట్రావు ఇంటర్వ్యూలో విజయం సాధించారు. ఈ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన అంటున్నారు.

సుదీర్ఘ పోరాటం చేశాం



ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందేందుకు సుదీర్ఘ పోరాటం చేశాం. 24 సంవత్సరాల అనంతరం మా జీవితాల్లో వెలుగులు నింపిన ఈ చర్య రాష్ట్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుంది. మా పోరాటానికి న్యాయం జరిగింది

– కోటిపల్లి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, 1998 క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్, మండపేట

ఊహించని వరం



ఉద్యోగాలపై ఆశలు వదులుకున్న సమయంలో ఊహించని వరంగా ఉద్యోగం లభించింది. ఇప్పటి వరకు నేను పౌరోహిత్యం చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– జీవీవీఎస్ఎస్ మోహన్, పెదపూడి, కాకినాడ జిల్లా.

మాటల్లో చెప్పలేను



నాకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో సాధించాను. సంతోషాన్ని మాటల్లో చెప్పలేను.

– టి.కృష్ణకుమారి, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా

ప్రశాంతంగా కౌన్సెలింగ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 285 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉత్తర్వులు ఇచ్చాం. ఎంపికైన వారందరూ వెంటనే విధుల్లో చేరాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నాం. వీరు ఎస్‌జీటీలుగా పనిచేయాల్సి ఉంటుంది.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈవో, కాకినాడ

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

అమలాపురం రూరల్: పెళ్లి కాని అమ్మాయిని గర్భవతిని చేసి, మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆ అమ్మాయికి డబ్బు ఆశ చూపి రూ.10 లక్షలకు మగ బిడ్డను అమ్మేశానని వచ్చిన వదంతులు అవాస్తమని పుల్లేటికుర్రు చర్చి పాస్టర్ హోసన్నా అన్నారు. కొందరు బ్లాక్ మెయిల్ చేసి కొంత డబ్బును ఇవ్వాలని కోరడంతో తాను నిరాకరించానని, అందుకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలసి వినతిపత్రం అందించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేసిన కొంతమంది వ్యక్తులపై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. పెళ్లి కాకుండానే గర్భవతి అయిన ఆమె తన దగ్గరకు వస్తే సహాయం చేసే సదుద్దేశంతో సలహా మాత్రమే ఇచ్చానని, తనపై కావాలని కొంతమంది అమ్మాయి కుటుంబానికి సంబంధం లేని వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. బాధితురాలు మాట్లాడుతూ తనకు గర్భం రావడానికి పాస్టర్ హోసన్నకు సంబంధం లేదన్నారు. తమ గ్రామంలో ఒక వ్యక్తి తనను ప్రేమించాడని, అతని ద్వారా గర్భం ధరించి పూర్తిగా మోసపోయానని తెలిపింది. ఈ ఘటనపై గ్రామస్తులు కోట రమేష్, నామాడి అబ్బులు, భాను ప్రకాష్, నక్క విజయ్, అమూల్య కలెక్టర్ గ్రీవెన్స్‌లో తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

రావులపాలెం: మోటారు సైకిళ్ల చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులకు తొమ్మిది నెలలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వచ్చినట్టు రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2022 సంవత్సరంలో రావులపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటారు సైకిళ్ల దొంగతనం కేసుకు సంబంధించి విశాఖపటాన్నికి చెందిన ఇద్దరు ముద్దాయిలైన ఉలవల రాజేష్ బాబు, ఉంద్రు నాగరాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. వాదనలు పూర్తి కాగా కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.భాస్కరరావు విచారణ అనంతరం ముద్దాయిలకు తొమ్మిది నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఎస్సై తెలిపారు.



వీడ్కోలు వందనం స్వీకరిస్తున్న బదిలీ అయిన రవీంద్రనాథ్‌బాబు

ఘనంగా వీడ్కోలు

ఏపీఎస్పీలో గౌరవ వందనం స్వీకరించిన బదిలీ అయిన రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు మూడో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గాను, జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీ అయిన ఎం.రవీంద్రనాథ్‌బాబుకు బుధవారం ఉదయం రమణయ్యపేటలోని బెటాలియన్ క్యాంపులో ఘనంగా వీడ్కోలు పలికారు. బెటాలియన్ సిబ్బంది వీడ్కోలుగా కవాతును ప్రదర్శించగా ప్రత్యేక వాహనంపై నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ మూడో బెటాలియన్‌కు కమాండెంట్‌గా విధులు నిర్వర్తించడం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఏపీఎస్పీ సిబ్బందితో మొదటి నుంచి పనిచేసిన అనుభవం ఉండడంతో బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనులు సిబ్బంది సహకారంతో చేపట్టామన్నారు. అడిషనల్ ఎస్పీ సీహెచ్ భద్రయ్య మాట్లాడుతూ సుమారు సంవత్సరం పాటు కమాండెంట్‌గా పనిచేసిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు బెటాలియన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా ఆస్పత్రికి అధునాతన అంబులెన్స్‌ను అందించడంతో పాటు బెల్ ఆఫ్ ఆరమ్స్ బిల్డింగ్‌కు శంకుస్థాపన, అడ్మిషన్ భవనం ప్రారంభించడం అభినందనీయమన్నారు. అడిషనల్ డీసీపీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్లు రవి, సత్యం, ఆర్ఐలు సురేష్ బాబు, రఘుబాబు, దాస్, రామకృష్ణ, గణేష్, తులసీదాస్, అజయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్లు రాఘవేంద్రరావు, శ్రావణి పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాల నివారణ

రైల్వే సీనియర్ డీఎస్ఓ శ్రీనాథ్

సామర్లకోట: ప్రతీ ఉద్యోగి తమ తమ విధులలో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా రైల్వేలో ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని విజయవాడ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ జె.శ్రీనాథ్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే కల్యాణ మంటపంలో సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలోని కాకినాడ నుంచి అనపర్తి వరకు ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన భద్రతా అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి, కార్మికులు తమ విధులు నిర్వహిస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రైల్వే గేటుమన్లతో పాటు కీ మన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకలు గమనించాలన్నారు. ఎటువంటి ప్రమాద సూచనలు కనిపించినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి కాలంలో రైళ్ల వేగానికి పట్టాలపై వెల్డింగ్‌లు వదలి వేసే అవకాశం ఉంటుందని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ఏడాది జనవరి 14 నుంచి రైళ్ల వేగం 110 నుంచి 130కి పెరిగిందని, దాంతో మరింత అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ డీఎస్ఓ

తమను తాము రక్షించుకోవడంతో పాటు రైల్వే ప్రయాణికులను, ఆస్తులను కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఇటీవల కొంతమంది ఉద్యోగులు సెల్‌ఫోన్‌లతో ఎక్కువగా గడపడం వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ మాట్లాడుతూ రైల్వేలోని అన్ని శాఖలలోను సిబ్బంది కొరత ఉందని, దానిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈఎన్ బి.శివప్రసాద్, విజయవాడ సేఫ్టీ అధికారులు వి.శ్రీనివాసకుమార్, ఎండీవీఆర్ సత్యనారాయణ, హరినారాయణ, కాకినాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, అధికారులు త్రినాథ్ కాశీ, రామసుబ్బారావు, సిగ్నల్ ఇన్‌స్పెక్టర్ జోగారావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం



వెలగపూడి సచివాలయంలో బుధవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సంతకం పెట్టి బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుని: తుని–గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. బుధవారం జరిగిన సంఘటనకు సంబంధించి జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని (45) ఏళ్ల వ్యక్తి విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వెళుతున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై నిక్కరు, వంగ పువ్వు రంగు టీ షర్ట్ ఉన్నాయి. గూడ్స్ రైలు లోకో పైలట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే జీఆర్పీ పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



ఘటనా స్థలిలో మృతదేహం

గోపాలపురం: మోటార్ సైకిల్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందినట్టు బుధవారం పోలీసులు తెలిపారు. కోమటికుంట గ్రామానికి చెందిన పొనుగుమాటి నాగేంద్ర(25)లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ దిగి మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు తన మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా కొయ్యలగూడెం నుంచి గోపాలపురం వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో నాగేంద్ర అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు నాగేంద్ర తండ్రి 10 సంవత్సరాల క్రితం మరణించడంతో తల్లి పుష్ప పెద్దకొడుకు రవీంద్ర, నాగేంద్రను గారాబంగా పెంచింది.

బైక్‌పై నుంచి జారిపడి..



హాఫీజ్ మృతదేహం

పెద్దాపురం: బైక్ అదుపు తప్పి వ్యక్తి జారి పడడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం పెద్దాపురంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెలుగుల సురేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చల్లా వారి వీధికి చెందిన మహ్మద్ అబ్దుల్ హాఫీజ్ (21) తన ఇద్దరి స్నేహితులతో కలిసి ఉదయం టిఫిన్‌కు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా డివైడర్‌ను బలంగా ఢీ కొట్టాడు. బైక్‌పై ఉన్న హాఫీజ్ జారిపడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

- రూ.11.24 లక్షల బంగారం, వెండి వస్తువులు, నగదు స్వాధీనం
- డీఎస్పీ రమణ

అంబాజీపేట: కాకినాడ, కోనసీమ ప్రాంతాల్లోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11.24 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నామని కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ చెప్పారు. అంబాజీపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజోలు మండలం సావరానికి చెందిన కట్టా అర్జున్, కాకినాడ జగన్నాథపురానికి చెందిన ధర్మాడి దుర్గాప్రసాద్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాల బాట పట్టారన్నారు. నగరం, రాజోలు, అమలాపురం టౌన్, కిర్లంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు దొంగతనాలు చేశారన్నారు. ఈ యువకులు ఈ నెల 11న గెద్దాడలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓఎన్‌జీసీ సైట్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా నగరం ఎస్సై ఎస్‌కె.జానీ బాషా అరెస్టు చేశారన్నారు. వీరి నుంచి రూ.3.81 లక్షల నగదు, రూ.7.4 లక్షల విలువైన 19 కాసుల (152 గ్రాములు) బంగారం, రూ.3,600 విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని బుధవారం రాజోలు కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ రమణ చెప్పారు. ఈ కేసులను ఛేదించి, నిందితులను అరెస్టు చేయడంలో పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రశాంత్‌కుమార్, నగరం ఎస్ఐ షేక్ జానీ బాషా, క్రైం పార్టీ హెచ్‌సీ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ డి.చిరంజీవి కృష్ణ, నగరం పోలీస్ స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ రమణ అభినందించారు.



అంబాజీపేటలో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

సాహిత్య పిపాసికి రికార్డులు దాసోహం

- ఒకేసారి ఐదు ప్రపంచ రికార్డులను సాధించిన కత్తిమండ ప్రతాప్
- శ్రీశ్రీ కళావేదిక ద్వారా పలు సాహితీ కార్యక్రమాలతో ఖ్యాతి

సఖినేటిపల్లి: కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఐదు ప్రపంచ రికార్డులను ఒకేసారి గెలుచుకొని తన సాహితీ ప్రస్థానంలో అరుదైన ఘనతను సాధించారు. సఖినేటిపల్లి మండలం ఉయ్యూరువారిమెరక గ్రామానికి చెందిన డాక్టర్ ప్రతాప్ అంచెలంచెలుగా ఎదుగుతూ సాహితీ శిఖరాలను అందుకున్నారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఐఎస్‌వో ప్రమాణాలు సాధించిన శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో నెలకో సాహితీ పండగ నిర్వహిస్తూ కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిల్లో 117 కవి సమ్మేళనాలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కింది.

అతి పెద్ద సాహిత్య సంస్థగా శ్రీశ్రీ కళావేదిక

ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కువైట్, దుబాయ్, మలేషియా, సింగపూర్, అమెరికా దేశాలలో ప్రతాప్ పర్యవేక్షణలో శ్రీశ్రీ కళావేదిక విస్తరించింది. సుమారు 25 వేల మంది సభ్యులు కళావేదికలో భాగస్వాములై ఉన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, యానాం, కర్నాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో కూడా కళావేదిక సభ్యులు ఉన్నారు. డాక్టర్ ప్రతాప్ పేరిట ఫ్యాన్స్ అసోసియేషన్ కూడా పనిచేస్తోంది. అసోసియేషన్ ద్వారా ఏపీ, తెలంగాణా రాష్ట్రాలలో 800 మంది సభ్యులు సాహిత్య, సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రికార్డులు ప్రతాప్ సొంతం

2016లో కత్తిమండ ప్రతాప్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అంతర్వేదిలో 1,500 మంది కవులతో 30గంటల 30 నిముషాల 30 సెకన్ల పాటు ప్రపంచ తెలుగు కవితోత్సవాన్ని నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు. మలికిపురంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల నాన్‌స్టాప్ కళారూపాల ప్రదర్శన తొలిసారిగా ఏర్పాటు చేసి, విభిన్న కళా ప్రదర్శనలతో ప్రముఖ గాయకుడు వంగపండు ప్రసాదరావు ముఖ్య అతిథిగా రికార్డు సృష్టించారు. వీటితో పాటు తొలిసారిగా కవిత్వంలో ఫేస్‌బుక్‌లో ఉన్న కవులు అందరితో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసి, కవి సమ్మేళనం నిర్వహించి రికార్డు సృష్టించారు. 2022 సంవత్సరంలో తాడేపల్లిగూడెంలో 24 గంటల పాటు నాన్‌స్టాప్ కవిసమ్మేళనం పేరిట 2 వేల మంది కవులతో ప్రపంచ తెలుగు కవితోత్సవం, తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలలో కళాకారులను ప్రోత్సహించడానికి 24 గంటలు 24 నిమిషాలు 24 సెకన్ల కళాప్రదర్శన, మలికిపురంలో రంగస్థల కళా ప్రదర్శన నిర్వహించారు. వీటి ద్వారా ఆంధ్ర, భారత్ టాలెంట్, వర్మ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో 250 మంది మహిళా కవయిత్రులతో జాతీయ మహిళ కవిసమ్మేళనం, విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ, రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీల్లో జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాలు నిర్వహించారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో వెబినార్‌లు నిర్వహించారు. శ్రీశ్రీ సాహిత్య చరిత్రపై, బోయి భీమన్న సాహిత్యంపై పుస్తకాలు తీసుకువచ్చారు.



దుబాయ్‌లో గ్లోబెల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రతాప్ (ఫైల్)

తాజాగా సొంతం చేసుకున్న రికార్డులు

ఈ నెల 9, 10, 11 తేదీలలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో 48 గంటల పాటు నిరవధికంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు పేరిట ఒక భారీ బృహత్తర కార్యక్రమాన్ని ప్రతాప్ నిర్వహించారు. సుమారు 3 వేల మంది కవులు, కళాకారులతో దీనిని ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు. దీనికిగాను ప్రపంచ సాహిత్య రికార్డులు నమోదు చేసే అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, కల్చరల్ వరల్డ్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్, మార్వెల్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు అసోసియేషన్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్, న్యూ వండర్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ ఆయన సాధించారు.

రచనలు

ట్రాన్స్ జెండర్స్‌పై 200 మంది కవులతో కవితా సంకలనాన్ని, పారిశుద్ధ్య కార్మికులపై 150 మంది కవులతో ప్రత్యేక కవితా సంకలనాన్ని రూపొందించారు. ఏపీ రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత నిర్మాణ సారథ్యంలో దిశ పాట, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి పథకాలపై ప్రత్యేక పాటను ఆయన రచించారు.

ఇదీ 'ప్రతాపం'

ప్రతాప్ సాహిత్య రంగంలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆయన సేవలను గుర్తించి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం గతంలో కవికోకిల గుర్రం జాషువా పురస్కారాన్ని, ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేసింది. గుంటూరులో ఏపీ క్రియేటివ్ కల్చరల్ నుంచి కాసుల పురుషోత్తమ కవి పురస్కారాన్ని, మాప్స్ నుంచి సాహిత్య భూషణ్ అవార్డు, రోటరీ ఆధ్వర్యాన సాహితీ భూషణ్, కవి భూషణ్ అవార్డులతో కూడిన బిరుదులను పొందారు. ఫిలంత్రోఫిక్ సొసైటీ నుంచి సాహిత్య తపస్వి, వేదిక నుంచి అక్షర తపస్వి, కొత్తపేట కళాసాహితీ నుంచి కవిమిత్ర, కవి విరాట్, సాహిత్య పిపాసి, సాహితీ సవ్యసాచి బిరుదులు పొందారు. దుబాయ్‌లో ఒక కార్యక్రమానికి అతిథిగా వెళ్లిన ఆయన అమెరికా గ్లోబెల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ నుంచి గ్లోబెల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. యునెస్కో నుంచి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని పొందారు.